# మహానటుడు


కైప్ప ఆదిశేషారెడ్డి

**ఆ రోజు ఆదివారం. స్కూలుకు సెలవు కావటంతో టిఫిన్ చేసిన తర్వాత వరండాలో కూర్చుని పేపర్ తాలూకు ఆదివారం మ్యాగజైన్ తిర గేయసాగాడు రాఘవ. ఆయన ఓ సెకండరీ గ్రేడు టీచర్.**

మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోని ఓ ప్రాథమిక పాఠశాలకు యిటీవలే బదిలీపై వచ్చాడు. అది చిన్న పల్లెటూరు కావడంతో, దగ్గరలోని మండల కేంద్రంలో ఫ్యామిలీ పెట్టి, రోజూ బస్సులో స్కూలుకు వెళ్ళి వస్తూంటాడు. తనకి ఎలాంటి దురలవాట్లు లేనందున, ఉద్యోగంలో చేరి నాలుగేళ్లే అయినప్పటికీ ఎటువంటి ఆర్థిక ఒడుదుడుకులు లేకుండా సంసారాన్ని సాఫీగా నెట్టుకొస్తున్నాడు.

పిల్లలు చిన్నవాళ్ళే కావడం వలన, వారికి చదువులు, ఫీజులు ఖర్చు మొదలు కాలేదు. భార్య సుశీల తనకి తగిన యిల్లాలే. ఆచి తూచి ఖర్చులు పెడుతుంది.

సుశీల కూడా టిఫిన్ చేసి, రెండు వేడి వేడి టీ కప్పులతో బయటకు వచ్చింది. రాఘవకో కప్పు యిచ్చి, తనో కప్పుతో ఎదురుగా




కూర్చుంది. టీ తాగి కబుర్లలో పడిపోయారు.

అంతలో గేటు తీసిన చప్పుడైంది.

ఇద్దరూ తలెత్తి చూశారు.

గేటు తీసుకొని, గోపాలం "హలో మాస్టారుగారూ! నమస్తే!" అంటూ లోపలకు వచ్చాడు.

"ఆ నమస్తే రండి సార్" అంటూ కుర్చీ చూపించాడు రాఘవ.

సుశీల లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"ఏంటిసార్ రాఘవగారూ! ఎలా ఉంది వూరు? వాతావరణం, ఈ లొకాలిటీ బాగుంటుంది. విలేజ్‌లోనే పీస్‌ఫుల్ ఏరియా. ఇక్కడంతా మిడిల్ క్లాస్‌వారే ఎక్కువ. మరి వాటర్ అదీ బాగుందా?" వరుసబెట్టి గోపాలం గడగడా మాట్లాడుతూ వుంటే, అన్నింటికీ మౌనంగా తలూపి సమాధానం చెప్పాడు రాఘవ. మనసులో పొద్దున్నే వీడెందుకు తగిలాడబ్బా అని ఆలోచిస్తూనే.

"అవును గోపాలంగారూ మీరుండేది?" ఏదో ఒకటి అడగాలి కాబట్టి.

"ఇక్కడికి పైన ఎడమవైపున పదో వీధిలో, ఒకసారి రండి సార్"

"అలాగే"

ఎదురుగా టీపాయి మీది పేపర్ అందుకొని చూడసాగాడు గోపాలం. అతని వంక చూస్తూ తనతో గోపాలం పరిచయాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు రాఘవ.

బదిలీపై ఈ మండలానికి వచ్చేంతవరకూ గోపాలంతో తనకి పెద్దగా పరిచయం లేదు. అప్పుడెప్పుడో ఉపాధ్యాయ ఉద్యమం చేపట్టిన ధర్నాలో కలుసుకున్న ముఖపరిచయం మాత్రమే. ఇక్కడికొచ్చిన తర్వాత యిద్దరూ ఒకే రూట్‌లో పనిచేయటం వలన కాసింత పరిచయం పెరిగింది.

ప్రతిరోజూ తామిద్దరూ ఒకే బస్సులో వెళ్ళి, ఒకే బస్సులో తిరిగి వస్తూ వుంటారు. అతను పనిచేసే ఊరు, తనకంటే పై స్టేజిలో. తను బస్సెక్కగానే, సిన్సియర్‌గా "గుడ్ మార్నింగ్" చెప్పటం, "రండి మాస్టారూ" అంటూ సీటు

చూపించటం జరిగేది. తనకి అంతకంటే అతనితో పరిచయం లేదు. తనకి అలా పరిచయాలు పెంచుకొనే అలవాటు కూడా లేదు. తను ఎప్పుడూ అతనిని యింటికి రమ్మని ఆహ్వానించిందీ లేదు.

"ఇలా చెప్పా పెట్టాకుండా, ఉరమని పిడుగులా పొద్దున్నే తగులుకోవటానికి ముఖ్యమైన కారణం ఏంటో?" అనుకున్నాడు రాఘవ.

గోపాలం పేపర్ అటూ యిటూ తిప్పుతున్నాడు. అతని ఉద్దేశం పేపర్ చదవాలని లేదని, ఏదో అడగటానికో, చెప్పటానికో ప్రిపేర్ అవుతున్నట్టు అన్పించింది రాఘవకు.

రెండుసార్లు పొడి దగ్గు దగ్గి, పేపర్ మడిచి ప్రక్కన పెడుతూ, "మాస్టరుగారూ! ఒక ముఖ్యమైన పనికోసం మీ దగ్గరకు వచ్చాను" అన్నాడు గోపాలం.

"చెప్పండి"

"మీ దగ్గరకు రావాల్సిన విషయం కాదు. కానీ పరిస్థితులు తప్పనిసరి అయింది" నసుగుతూ అన్నాడు.

"చెప్పండి గోపాలంగారూ సమస్య ఏంటి?"

"మా మిసెస్‌కి హెల్త్ ప్రాబ్లమ్! లాస్ట్ వీక్‌లో ఒక గైనకాలజిస్ట్‌కి చూపించాను. టెస్ట్‌లన్నీ చేసి, ఆపరేషన్ చేయాలంటుంది డాక్టర్. ఖర్చు పదివేలకి అయ్యేట్లుంది. నా దగ్గర అయిదు వేలుంది. మరో అయిదు వేలు అవసరం. ఇలా అడుగుతున్నానని మరోలా అనుకోవద్దు. ఈ సాయం చేసి నా భార్యని బ్రతికించండి మాస్టారూ! ఏదో ఒక చిట్ వేసి సంవత్సరంలోగా మీ బాకీ తీర్చేస్తాను" అన్నాడు. అలా చెప్పేటప్పుడు గోపాలం కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరగటం గమనించాడు రాఘవ.

అయినా తనకి ఇక్కడ అంతా కొత్త. ఎవరితోనూ ఎలాంటి పరిచయాలు లేవు. ఇవ్వటమా కాదనటమా? తను ఎంతో కష్టపడి మిగిలించుకున్న సొమ్ము.

"ఏంటి మాస్టారుగారూ ఆలోచిస్తున్నారు. నాకు ఇలాంటివి అడిగే అలవాటు లేదు. మొదటిసారి యిలాంటి సమస్యను ఫేస్ చేస్తున్నాను. ఎందుకో మిమ్మల్ని చూస్తుంటే ఆత్మీయులుగా కనిపిస్తారు. కాదనరనే ధైర్యంతో వచ్చాను. నా భార్య జీవితం మీ చేతిలో ఉంది మాస్టారూ!" కళ్ళల్లో చెమ్మగిల్లిన నీటిని కర్చీఫ్‌తో అద్దుకున్నాడు గోపాలం.

"గోపాలంగారూ! యేంటిది చిన్నపిల్లాడిలా వూర్కోండి" అన్నాడేగాని మనీ యిస్తానని మాట యివ్వలేదు రాఘవ. "చూడండి గోపాలంగారూ! నేను నీలాగే చిరుద్యోగిని. నాలుగు వేలలోపే జీతం తీసుకొనేవాణ్ణి. ఏకంగా ఐదు వేలు అంటే మాటలా? ఆపరేషన్ అంటున్నారు. వెంటనే యిచ్చేట్లు వుంటేనే మాట చెప్పాలి. ప్రస్తుతం నా దగ్గర అంత లేదే" ఉన్న సంగతి బయటపెట్టాడు రాఘవ.

"కొంతయినా సర్దండి మాస్టారూ, మిగిలింది మరోచోట ప్రయత్నిస్తాను."

ఈలోగా సుశీల టీ తెచ్చింది. కప్పు గోపాలానికి యిచ్చి, రాఘవను లోపలకు రమ్మని సైగ చేసింది.

"ఒక్క నిముషం టీ తాగుతూ వుండండి" అంటూ రాఘవ లేచి లోపలికెళ్ళాడు.

"వాళ్ళావిడకు ఆరోగ్యం బాగాలేదట. ఆపరేషన్ చేయించాలని మనీ అడ్జెస్ట్ చేయమని" సుశీలకు క్వశ్చన్ మార్కు సమాధానం చెప్పాడు రాఘవ.

"ఆయన మీకు తెలుసుకదా?" అడిగింది సుశీల.

"తెలియకేం నాలాగే టీచర్. నేను పనిచేసే వూరికి ఇంకొంచెం అవతల. ఇద్దరం ఒకే బస్సులో వెళ్ళి వస్తుంటాం."

"మరింకేం టీచరంటున్నారు. పక్కన అంటున్నారు. భార్యకు బాగోలేదని కళ్ళనీళ్ళు పెట్టుకొని ప్రాధేయపడుతుంటే, [illegible] చెప్పి సర్దుబాటు చేస్తానని [illegible] ్సందిపోయి అలా నీళ్ళు నములుతా[illegible]దుకు?"

"అ[illegible]టు సుశీ డబ్బు విషయం కదా? ముందూ వెనకా"

"చాల్లే వూరుకోండి. ఎవరి కష్టాలు ఎలా వుంటాయో ఎవరు చూసొచ్చారు. మనం కూడా మిడిల్‌క్లాస్ వాళ్ళమేనండీ. ఇలాంటి కష్టాలు మనకీ రావచ్చు. మనమే ఒకరికొకరు సాయం చేసుకోవాలండీ. ముందు ఆవిడ ఆరోగ్యం సంగతి చూడండి. మనం మనుషులమండీ. పక్కవారి కష్టాలను పంచుకోవాలి" ఆడ మనసు క్లాసు పీకుతుంటే తరగతిలో క్లాసు పీకే రాఘవ నోరెత్తలేదు.

"ఇప్పటికిప్పుడు ఐదువేలు"

"మరేం వర్రీ కాకండి. నా పోస్టాఫీసు సేవింగ్స్ బ్యాంక్‌లోంచి తీసి యిస్తాను. ఆయనకి ధైర్యం చెప్పి పంపండి" అంది సుశీల.

## ఏనుగులకా ఈ ఎగతాళి!



ఆఫ్రికా తరవాత భారతదేశం ఏనుగుల సంతతికి పెట్టింది పేరు. పురాతన కాలం నుంచి మన సంస్కృతిలో ఏనుగులకి సముచిత స్థానం ఉంది. ఇటీవల ఏనుగుల సంతతి తగ్గిపోతున్నదని వన్యప్రాణి సంరక్షణా సంస్థల ఆందోళన. మరోపక్క వాటి సంఖ్య సమస్యలను సృష్టిస్తోందని వ్యాఖ్యలు వస్తున్నాయి.

ఈశాన్య రాష్ట్రాలలో అడవులను కొట్టివేయరాదని తీవ్ర ఆంక్షలు విధించారు. దానితో ఏనుగులకి పని తగ్గిపోతోంది. సుమారు వెయ్యి వరకు నిరుద్యోగ ఏనుగులు తయారయ్యాయి. వీటని సాధారణంగా "పెంపుడు అడవి ఏనుగులు" అంటారు. ప్రస్తుతం వీటి యజమానులకి, అటవీశాఖాధికారులకి ఇదొక సమస్య అయింది. ఏనుగు చచ్చినా వెయ్యి, బతికినా వెయ్యి అనే సంగతి ఎలా ఉన్నా ఒక్కొక్క దానికి ప్రస్తుత పరిస్థితుల్లో నెలకి కనీసం 10,000 రూపాయల ఖర్చు అవుతుంది. ఇది ఎలా భరించగలం అని సుమారు 800 మంది గజ యజమానులు తెగ ఇబ్బంది పడిపోతున్నారు.

కారడవుల్లో వృక్షాలను పడగొట్టాక కలపని బయట ప్రాంతాలకు తీసుకొని రాగలిగేవి ఒక్క ఏనుగులు మాత్రమే. మరో గత్యంతరం లేదు. సుమారు 200 ఏనుగులను ప్రభుత్వ, రైల్వే అధికారులు వినియోగిస్తూ ఉంటారు. అస్సాంలోనే కనీసం 1,200 ఇలాంటి ఏనుగులున్నాయి. మిగతా 1000 ఏనుగుల గతి ఏమిటి? అంటే ఇక ఏనుగులు వీధిని పడ్డాయి. గజాననా! ఏమి పరిస్థితి నీకు అని అందరూ కుమిలిపోతున్నారు. కొన్నిటిని అడవుల్లోకి తిరిగి వదిలిపెట్టేస్తున్నారు. వీటిని ఫీరల్ ఏనుగులు అంటారు. ఏనుగుల పెంపకాన్ని ఒక హోదాగా స్వీకరించేవారూ ఉన్నారు. కష్టమైనా నష్టమైనా కొంతమంది పెంచుకుంటారు.

మనాస్ సాంక్చువరీలో మావటీల స్కూలు ఏర్పడింది. దానిలో 20 మంది వరకు శిక్షణ ఇస్తున్నారు. ఏనుగులకి మంచి కాలం రాకుండా ఉంటుందా? అప్పుడు మావటీలు కరువయితే ఎలా? అందుకే ఈ శిక్షణాలయం.

**– జిమ్మి కోనేటిరావు**

## చలిగాడు



చలిగాడు
పేదల గుడిసెల్లోకి
అతిథిలా చొరబడతాడు
వారి చిరుగుల గుడ్డల్లో దూరి
బెబ్బులిలా కబళిస్తాడు
ఏసీ ఫుల్‌గా పెట్టేసి
వజవజ వణికిస్తాడు
చలిగాడైనా
వాడి అబ్బైనా
ధనవంతుల భవంతుల్లోకి
చొరబడగలడా?
మఫ్లరు, స్వెట్టరు, రగ్గులతో
చలి పులిని తరిమేస్తారు
వాడి భరతం పట్టేస్తారు
ప్రేమికులకు
కొత్త జంటలకు
చలిగాడు
గిలిగింతలు పెట్టే
చెలికాడు
వెచ్చటి ప్రేమ కుంపటి
రగిలిస్తాడు
సరసాల మసాలా నింపి
మధురోహల తేలిస్తాడు
మరో లోకాలకు
తరలిస్తాడు

– బద్ది నాగేశ్వరరావు

లోపల నుండి బయటికి వస్తూ, "సరే గోపాలంగారూ! మీ ఆవిడ ఆపరేషన్‌కి అయిదు వేలు అడ్జెస్ట్ చేస్తాను. మిడిల్ క్లాస్ ఉద్యోగులం. ఒకరి సాయం మరొకరికి తప్పనిసరి. రేపు రండి" అన్నాడు రాఘవ.

ఆ మాట గోపాలం కళ్ళలో వెలుగు నింపింది. నయనాల్లో ఆనందబాష్పాలు కదిలాయి. సంతోషంతో రాఘవ చేతులు పట్టుకొని తన ప్రతిస్పందన తెలియజేశాడు. మరుసటి రోజు సాయంత్రం వచ్చి మనీ తీసుకొని థ్యాంక్స్ చెప్పివెళ్ళాడు గోపాలం.

ఆ తర్వాత వారం రోజుల పాటు గోపాలం కనిపించలేదు. ఆ రోజు తన దగ్గర గోపాలం పడిన బాధ కళ్ళకి కట్టినట్లు కనిపించింది రాఘవకు. "ఎవరికి, ఎప్పుడు, ఎలాంటి కష్టాలు వస్తాయో చెప్పలేం పాపం గోపాలం" అనుకున్నాడు రాఘవ.

వారం రోజుల తర్వాత స్కూల్‌కి బస్సెక్కాడు గోపాలం. రాఘవ కనిపించగానే, "థ్యాంక్స్ మాస్టారూ! మీ సహాయం మరువలేనిది. మా ఆవిడకు ఆపరేషన్ సక్సెస్ అయింది. నాలుగైదు నెలలు రెస్ట్ కావాలంటే వాళ్ళ అమ్మగారింట్లో వుంచాను" అంటూ కృతజ్ఞతలు తెలియజేశాడు.

"పోనీలే ఆవిడ ఆరోగ్యం బాగయింది" అన్నాడు రాఘవ.

తర్వాత మామూలే. రోజులు గడిచిపోతున్నాయి.

గోపాలం సామాన్యుడు కాదని, మహానటుడనీ, తనకి చెప్పినట్లుగానే అతని భార్యకి ఆపరేషన్ అని చెప్పి చాలామంది దగ్గర అప్పులు చేశాడని తెలిసింది. కొత్తగా వచ్చే టీచర్లను, ఇతర ఉద్యోగులను పరిచయం చేసుకోవటం, నిదానంగా కట్టుకథలు చెప్పి అప్పు చేయటం, ఆ మనీతో ఓ పదిరోజుల పాటు మందు కొట్టడం, పేకాట ఆడటం చేసేవాడు. ఇలా తనకే కాదు, తనతోపాటు మరో పదిమందికి టోపీ వేశాడని తెలుసుకొని రాఘవ విస్తుపోయాడు.

కనిపించిన ప్రతిసారీ, "సారీ మాస్టారూ! త్వరలో యిచ్చేస్తాను" అంటూ చేతులు పట్టుకొని చెప్పటం గోపాలం వంతు. విని సరిపెట్టుకోవటం రాఘవ వంతు అయింది.

సంవత్సరాలు గడిచాయి.

రాఘవకు ప్రమోషన్ వచ్చి, వేరే ప్రాంతానికి వెళ్ళిపోయాడు. దాదాపుగా గోపాలాన్ని, గోపాలం బాకీ గురించి మర్చిపోయాడు.

ఒక రోజు బస్సుకోసం బస్టాండ్‌లో వెయిట్ చేస్తున్న రాఘవకు కనిపించాడు గోపాలం. బాగా చిక్కిపోయి, గుర్తు పట్టలేనంతగా మారిపోయి ఉన్నాడు.

"హలో గోపాలంగారూ!" పిలిచాడు రాఘవ. వెనక్కి తిరిగి చూసి తల వంచుకున్నాడు.

"అరె గోపాలంగారూ! ఏమైంది? ఆ విషయం నేనెప్పుడో మర్చిపోయాను"

గోపాలం కళ్ళల్లో నీళ్ళు కదిలాడాయి. "మీరంతా మర్చిపోయారు సార్! నాకు మర్చిపోలేని షాక్ తగిలింది. మీరంతా మనుషులు కాబట్టి మోసగించాను. కాని ఆ భగవంతుడ్ని మోసం చేయలేకపోయాను. ఆరోగ్యంగా ఉన్న నా భార్యకి రకరకాల జబ్బుల పేర్లు చెప్పి, బాకీలు చేసి తాగి తందనాలాడాను. చివర్లో నా భార్య హాస్పిటల్లో చావు బ్రతుకుల్లో వుంటే అప్పు యిచ్చేవాడు లేక.. ఆమె శాశ్వతంగా వెళ్ళిపోయింది. నేను చెప్పిన అబద్ధాలు నా భార్యని మింగేశాయి. ఇదిగో ఇలా ఏకాకిగా మిగిలిపోయాను" ఉబికి వస్తున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ జనంలో కలిసిపోయాడు గోపాలం.

ఇది మరో నాటకం అనీ, గోపాలం భార్య నిక్షేపంగా వుందనీ, తెలియక, జనంలోకి సాగిపోతున్న ఆ మహానటుని వంక చూస్తూ, "ప్చ్ పాపం గోపాలం" అనుకున్నాడు రాఘవ. ※

